క్లుప్తంగా

శివ క్షేత్రానికి విరాళం



ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి

బాపట్లఅర్బన్: సూర్యలంక శివ క్షేత్ర ఆలయం నిర్మాణం అద్భుత రీతిలో జరుగుతోందని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆలయాన్ని సందర్శించి, పూజలు నిర్వహించారు. రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు మాట్లాడుతూ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం మే నెల 12,13 తేదీలలో జరుగనున్నట్లు వెల్లడించారు. శృంగేరి జగద్గురువుల ఆశీస్సులతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. భక్తులందరూ సహకరించాలని కోరారు. ధర్మకర్తలు ఎం. దశరథ మహారాజు, జి. మూర్తి రాజు, గోపాలకృష్ణ, చిత్రకారులు బ్రహ్మం పాల్గొన్నారు.

దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ వై. సురేష్

భట్టిప్రోలు: చోరీలు, నేరాల నియంత్రణకు వ్యాపారస్తులు దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని భట్టిప్రోలు ఎస్ఐ వై. సురేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రమైన భట్టిప్రోలు, వెల్లటూరు గ్రామాలలోని అన్ని దుకాణదారులతో ఎస్ఐ సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ దుకాణదారులు ఎవరికి వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నా ఫర్వాలేదు, లేని ఎడల అందరూ కలసి సంయుక్తంగా ఏర్పాటు చేసుకున్నా ఇబ్బంది లేదని తెలిపారు. వీటిని ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాల నియంత్రణ తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ఒక వేళ చోరీ జరిగితే ఛేదించేందుకు త్వరగా అవకాశం దొరుకుతుందన్నారు. ఇందుకు వ్యాపారస్తులు అందరూ సహకరించాలని కోరారు.

లిఫ్టర్ రేవతికి ఎమ్మెల్యే అభినందన

తెనాలి: రాష్ట్రస్థాయి సీనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బ్రెంచిప్రెస్ చాంపియన్‌షిప్–2023లో 63 కిలోల విభాగంలో తలపడి బంగారు పతకం సాధించిన తెనాలి యువతి వక్కలగడ్డ రేవతిని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన 10వ సీనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బ్రెంచిప్రెస్ చాంపియన్ షిప్–2023 పోటీలు జరిగాయి. బుధవారం సాయంత్రం రేవతిని సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్, భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు.

మోదీ పాలనలో పెరిగిన ధరలు

తెనాలి: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగటంతో సామాన్యులు బతకలేని పరిస్థితి వచ్చిందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా రైతు సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. ఈ కార్యక్రమ ప్రచార కరపత్రాలను బుధవారం తేలప్రోలు, కొలవరం, కంచర్లపాలెం గ్రామాల్లో సాంబిరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముద్దన సాంబశివరావు, కంచర్ల తారకేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావు

తెనాలిటౌన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు పెయింటింగ్‌లో ఇస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న 42 మంది ఆర్యవైశ్య మహిళలకు సర్టిఫికెట్లను సంఘ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాలి శేషాచలం ప్రధానం చేశారు. పెయింటింగ్ శిక్షకురాలు వాణిశ్రీని సత్కరించారు. ఆర్యవైశ్య మహిళ సంఘ అధ్యక్షురాలు కొండవీటి లక్ష్మీపద్మావతి నిర్వహణలో 30రోజుల పాటు శిక్షణ జరిగిందని వివరించారు. రాబోయే రోజుల్లో ఎంబ్రాయిడరీ, గొలుసులు, మగ్గం వర్క్స్, గ్లాస్ పెయింటింగ్, కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన ఆర్యవైశ్య మహిళలందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధ్యక్షుడు శ్రీనివాసరావు సూచించారు.

ప్రతి ఇంటా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- శీలంవారిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ప్రతి ఇంటా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని శీలంవారిపాలెం సచివాలయం పరిధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాలకు సంబంధించిన జాబితాను అందించారు. బాపట్ల పట్టణంలో రోడ్ల విస్తరణ చేపట్టడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇళ్ళ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేయటంతో అందరు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పథకాలు అందిన తీరును లబ్ధిదారులు ఎంతో ఉత్సాహంగా కోన రఘుపతికి వివరించారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి అడిగిందే తడవుగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేశారని గుర్తు చేశారు.ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటిగా పనులు చేసుకుంటూ పోద్దామని సూచించారు. బాపట్లకు మెడికల్ కళాశాల నిర్మాణంలో మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, మున్సిపల్ మాజీ ప్రతిపక్షనేత షేక్ సయ్యద్ పీర్, కాగిత యఙ్రయ్య, నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, నర్రా వెంకట్రావు, ఇనగలూరి మాల్యాద్రి, సోముల రాజశేఖర్‌రెడ్డి, జాలిరామిరెడ్డి, నర్రావుల వెంకట్రావు, కొక్కిలిగడ్డ చెంచయ్య, ఆట్ల ప్రసాదరెడ్డి తదితరులు ఉన్నారు.

కేంద్రాన్ని ఎత్తేశారు – సమస్య రాజేశారు!

- భట్టిప్రోలులో పరీక్షా కేంద్రం ఎత్తివేయడంతో విద్యార్థుల అవస్థలు
- 600 మంది వరకు విద్యార్థులు పరీక్షలకు హాజరు



ఇంటర్మీడియట్ పరీక్షల కోసం కేఎస్‌కే కళాశాల ఏర్పాటు చేసిన బస్సులలో ఎక్కుతున్న విద్యార్థినులు

భట్టిప్రోలు: మండల కేంద్రమైన భట్టిప్రోలులో ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షా కేంద్రాన్ని ఎత్తి వేయడంతో విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. భట్టిప్రోలు కేఎస్‌కే బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు చెరుకుపల్లి, కావూరు, నగరంలలో పరీక్షా కేంద్రాలు కేటాయించారు. ఈ కళాశాల నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సుమారు 500 మంది హాజరవుతున్నారు. దీంతో ఆయా కేంద్రాలకు చేరుకునేందుకు కళాశాల యాజమాన్యం బుధవారం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి ఆయా కేంద్రాలకు తరలించేందుకు చర్యలు చేపట్టింది. అలాగే స్థానిక ఎంఆర్ఆర్ అండ్ ఏవీఎస్ విద్యార్థులకు చెరుకుపల్లి, కావూరు, నగరంలలో రాఘవా జూనియర్ కళాశాల విద్యార్థులకు రేపల్లెలో సెంటర్ కేటాయించారు. మొత్తం మీద భట్టిప్రోలు నుంచి 600 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద నుంచి గమ్య ప్రాంతాలకు నిర్ణీత సమయానికి చేరుకోవాలంటే కష్టసాధ్యమైన పరిస్థితి నెలకొంది. ఉదయం 9 గంటల లోగా పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు విధిగా ఉండాలని బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ఆయా కళాశాలకు చెందిన విద్యార్థులు చాలా మంది లంక గ్రామాలకు చెందిన వారు కావడం వల్ల పరీక్షా కేంద్రానికి చేరుకోవాలంటే మూడు, నాలుగు ఆటోలు మారాల్సిన పరిస్థితి నెలకొంది. జంబ్లింగ్ విధానం ద్వారా గతంలో భట్టిప్రోలులో ఎంఆర్ఆర్ అండ్ ఏవీఎస్ కళాశాల, కేఎస్‌కే బాలికల జూనియర్ కళాశాలలో పరీక్షలు రాసే వారు. ఈ కళాశాల ఎత్తివేయడంతో 15 నుంచి 30 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న పరీక్షా కేంద్రాలకు వెళ్లి పరీక్షలు వ్రాయాలంటే కష్టతరంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు.

మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలు

డీఎస్పీ మురళీకృష్ణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

రేపల్లె: మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలే జరుగుతాయని రేపల్లె డీఎస్పీ టీ.మురళీకృష్ణ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ ఏర్పాటు అంశంపై పట్టణంలోని ఐఆర్‌ఈఎఫ్ విద్యాసంస్థలైన ఆర్‌సీ కళాశాల ఆవరణంలో విద్యార్థులకు బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తుపదార్థాలైన గంజాయి, ఖైనీ, గుట్కా, విమల్ వంటి పదార్థాలు తీసుకోవటంతో క్యాన్సర్ వంటి వ్యాధులబారిన పడతారని హెచ్చరించారు. నరాల బలహీనత, మానసిక ఒత్తిడిలకు గురయ్యేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. నోరు, గొంతు, జీర్ణాశయం, ఊపిరితిత్తులు వంటి అవయవాలు పూర్తిగా దెబ్బతింటాయని చెప్పారు. విద్యార్థులు తమ భవిష్యత్‌కు బంగారు బాటలు పడలంటే ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటుపడి అనేక మంది తమ జీవితాలను నాశనం చేసుకున్నారన్న అంశాన్ని తెలిసి ఉండాలన్నారు. కేవలం విద్య, ఆటలపైనే తమ దృష్టిని కేంద్రీకరించాలని చెప్పారు. తమ తోటి వారు ఎవరైనా ఇటువంటి వ్యసనాల బారినపడితే వారు సత్ప్రవర్తనతో నడిచేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌ఈఎఫ్ విద్యాసంస్థల అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా, ప్రవాసాంధ్రులు జాన్ రెబ్బా, దీవెన రెబ్బా, కళాశాలలు, విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22న అల్లూరులో ఉగాది వేడుకలు

పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు గ్రామంలో వేంచేసిఉన్న శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 22వ తేదీన ఉగాది తెలుగు సంవత్సర వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి తెలిపారు.అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. 22వ తేదీన ఉదయం స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉత్పల అనంతరామ్‌చే పంచాంగ శ్రవణం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

భట్టిప్రోలులో కాన్షీరామ్ జయంతి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఎస్పీ నేతలు

భట్టిప్రోలు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకులు కాన్షీరామ్ 89వ జయంతి పురస్కరించుకుని బుధవారం ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీఎస్పీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జడా రవీంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దాసరి వెంకటేశ్వరరావు, వేమూరు నియోజకవర్గ బీఎస్పీ నాయకులు పూరేటి మాణిక్యారావు, మండే పిచ్చయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలంపాట

రేపల్లె: వివిధ కేసులలో పట్టుబడిన పలు వాహనాలకు పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) కార్యాలయ ఆవరణంలో ఈ నెల 16వతేది గురువారం ఉదయం 10.30 గంటలకు వేలంపాట నిర్వహిస్తామని సెబ్ సీఐ లీనా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి నిర్వహించే వేలంపాటలో ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొని వాహనాలను కైవసం చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు స్థానిక సెబ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వైభవంగా ధార్మిక పూజా మహోత్సవాలు

కొల్లూరు: ధార్మిక పూజా కార్యక్రమాలు ఘనంగా మండలంలోని ఈపూరులంకలో ఘనంగా నిర్వహిస్తున్నారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో చేపట్టిన పూజా కార్యక్రమాలలో భాగంగా స్థానిక శ్రీరామాలయంలో భజన సంకీర్తనలు ఆలపించారు. హిందు ధర్మ ప్రచారక్ సభ్యులు ఈ సందర్భంగా భక్తులకు రామాయణం, భగవద్గీతల గురించి వివరించారు. పూజా కార్యక్రమాలలో భాగంగా పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గోవింద నామాలతో సంకీర్తనలతో రామాలయానికి చేరుకుని భజన సంకీర్తనలు నిర్వహించారు. టీటీడీ, హిందు ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు జంజనం హేమశంకరరావు, క్రాప రవికుమార్‌లు పాల్గొన్నారు.

హక్కులకు మరింత పదును



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫోరంఫర్‌బెటర్ బాపట్ల సభ్యులు

బాపట్ల అర్బన్: నూతన చట్టం వినియోగదారుల హక్కులకు మరింత పదును పెడుతోందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు పేర్కొన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆహార, శాస్త్ర సాంకేతిక కళాశాలలో జరిగిన ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో గోడ ప్రతులను విడుదల చేశారు. ఫోరం సభ్యులు మాట్లాడుతూ ఆన్‌లైన్ లావాదేవీలు కూడా చట్ట పరిధిలోకి వచ్చాయని, తప్పుదారి పట్టించే వ్యాపార ప్రకటన చేసేవారిపై చర్యలు ఉంటాయన్నారు. వస్తు నాణ్యతలో తేడా వస్తే ఉత్పత్తిదారులతో పాటు విక్రయదారులని కూడా బాధ్యులుగా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ఏడీ డాక్టర్ సి.హెచ్.వి.వి.సత్యనారాయణ, ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, అధ్యాపకులు డాక్టర్ విమల, సోమేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.సురేష్, వేదికపై ఎఫ్‌డీఓలు

బాపట్ల అర్బన్: మండలంలోని సూర్యలంక తుఫాను షెల్టర్ వద్ద చేపలు, రొయ్యల విలువ ఆధారిత ఉత్పత్తులపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి.సురేష్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ, గ్రీన్ క్లయిమేట్ ఫండ్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా గ్రీన్ క్లయిమేట్ ఫండ్ వారి ఆర్థిక నిధులతో తీర ప్రాంతంలోని మత్స్యకారులకు పర్యావరణ సంసిద్ధతను పెంపొందించేందుకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన ద్వారా జీవనోపాధిని పెంపొందించడానికి ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. శిక్షణలో భాగంగా చేపలు, రొయ్యల నుంచి వివిధ రకాల విలువ ఆధారిత ఉత్పత్తులైన చేప, రొయ్య పచ్చళ్లు, చేప బాల్స్, చేప కట్‌లెట్స్, చేప చట్నీ పొడి, రొయ్య శాండ్‌విచ్, చేప పరోటా, రొయ్య స్వీట్ కార్న్ సమోసా వంటి తదితర విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చీరాల అసిస్టెంట్ డైరెక్టర్ బి.కృష్ణ కిషోర్, నిజాంపట్నం ఎఫ్‌డీఓ సాయి సందీప్, కూచిపూడి ఎఫ్‌డీఓ మహిజ, బాపట్ల ఎఫ్‌డీఓ రవీంద్ర, గ్రామ మత్స్య సహాయకులు, శిక్షణ కార్యక్రమంలో స్వయం సహాయక మహిళలు, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో పంటల నమోదు వివరాలు



చింతాయపాలెంలో పంట నమోదు ముసాయిదా ప్రకటించిన ఏవో సుమంత్ కుమార్

కర్లపాలెం: రబీ సీజన్‌కు రైతులు సాగు చేసిన పంటల నమోదు వివరాలను అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ముసాయిదా ప్రకటన చేశామని కర్లపాలెం మండల ఏవో సుమంత్‌కుమార్ తెలిపారు. ఏవో గ్రామ వ్యవసాయ సహాయకులతో కలసి రైతు భరోసా కేంద్రాల వద్ద బుధవారం ముసాయిదా ప్రతులను ఉంచారు. ఈసందర్భంగా సుమంత్‌కుమార్ మాట్లాడుతూ పంట నమోదు వివరాలను తేడాలు ఉంటే రైతులు వ్యవసాయాధికారులకు తెలియజేయాలని కోరారు. ఈనెల 20వ తేదీలోపుగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించుకోని రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి వేలిముద్రలద్వారాగాని ఆధార్‌కార్డుకు లింకైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా గానీ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు ధృవకుమార్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాతంశెట్టి లక్ష్మణరావు, రైతులు ఉన్నారు.

ఈ–క్రాప్‌లో తప్పులుంటే సరిచేసుకోండి

ఏవో బాలాజీ గంగాధర్



ఈ–క్రాప్ వివరాలను రైతులకు వివరిస్తున్న ఆర్బీకే సిబ్బంది

చెరుకుపల్లి: మండలంలో రబీ సాగులో ఉన్న 15,971 ఎకరాలకు ఈ–క్రాప్ నమోదు చేయటం జరిగిందని మండల వ్యవసాయాధికారి టి.బాలాజీ గంగాధర్ పేర్కొన్నారు. మండలంలోని రాంబొట్ల పాలెం గ్రామంలోని ఆర్బీకే కేంద్రం వద్ద గ్రామ సభను బుధవారం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల వివరాలు అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించటం జరిగిందని, ఏమైనా తప్పులు మార్పులు చేర్పులు ఉంటే వెంటనే అభ్యంతరాలను ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద లిఖిత పూర్వకంగా గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాపట్ల జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చీరాల ప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బి.విజయానంద్ వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి చీర బహూకరణ



వెండి చీరను అందజేస్తున్న రాధాకృష్ణమూర్తి

రేపల్లె రూరల్: పేటేరు గ్రామదేవత మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారికి ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు కందుల సాంబశివరావు కుటుంబ సభ్యులు అందించిన రూ.3 లక్షల విలువైన వెండి చీరను వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు ముందుకు వస్తే ఆలయాన్ని మరింత అభివృద్ధి చెందుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు అల్లంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్, మునుసోబు పరుచూరి శ్యాంప్రసాద్, నాయకులు రావు సూరిబాబు పాల్గొన్నారు.

రేపల్లెలో తొలిరోజు 42 మంది గైర్హాజరు



గీతం కళాశాల వద్ద హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు

రేపల్లె రూరల్: ఇంటర్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలు బుధవారం పట్టణంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాలలో తొలిరోజు 1089 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావల్సి ఉండగా 42 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్‌సీ జూనియర్ కళాశాల సెంటరులో 334 మందికి ఏడుగురు, జేఎల్‌బీ కళాశాలలో 256 మందికి 13 మంది, చైతన్య కళాశాల సెంటరుకు 224 మందికి 12 మంది, జూనియర్ కళాశాల సెంటరుకు 252 మందికి నలుగురు, గురుకుల జూనియర్ కళాశాల 254 మందికి ఆరుగురు విద్యార్థుల చొప్పున గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు.

పీవీపాలెంలో 18 మంది గైర్హాజరు

పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు నిఘా నీడలో ప్రారంభమైయ్యాయి. ఈ పరీక్షలకు మొత్తం 315 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 18 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ ఎస్.కె.జుభేర్ తెలిపారు. పిట్టలవానిపాలెం, కర్లపాలెం, చందోలు, ఖాజీపాలెం కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రంలో లోపల, బయట ప్రాంతంలో కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లా కేంద్రానికి సీఎం డాష్‌బోర్డుకు అనుసంధానం చేసినట్లు తెలిపారు. పరీక్షలు పూర్తి పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద మహిళా పోలీసులు, చందోలు పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

చెరుకుపల్లిలో 20 మంది గైర్హాజరు

చెరుకుపల్లి: మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షకు 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామ్ సూపరింటెండెంట్లు జి.రామచంద్రరావు వై దాసు బుధవారం తెలిపారు. మండలంలో కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 332 మంది విద్యార్థులకు గాను ఎనిమిది మంది గైర్హాజరు కాగా 324 మంది పరీక్షకు హాజరయ్యారని, అదేవిధంగా పొన్నపల్లి గీతం జూనియర్ కళాశాలలో 327 మంది విద్యార్థులకు గాను 12 మంది గైర్హాజరు కాగా 315 మంది పరీక్షకు హాజరయ్యారని వారు తెలిపారు. మొదటి రోజు పరీక్షా కేంద్రానికి విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే చేరుకుని వారికి కేటాయించిన రూముల వివరాలు నోటీసు బోర్డులో పరిశీలించుకున్నారు.

పథకాలపై రైతులకు అవగాహన ఉండాలి

సర్పంచ్ శ్రీనివాసరావు



పశువైద్య శిబిరాన్ని ఆరంభిస్తున్న శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: రైతులు ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ ఉయ్యూరు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుడికాయలంక రైతుభరోసా కేంద్రం వద్ద నిర్వహించిన ఉచిత పశు వైద్యశిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు నరేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులకు పశువిజ్ఞాన బడి కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు గుడికాయలంక గ్రామంలో రైతులకు ఐదు టన్నులు సంపూర్ణ మిశ్రమ ద్రావణాన్ని అందించామన్నారు. రేపల్లె మండలంలో 205 గేదెలు గ్రౌండింగ్ చేయటం జరిగిందని వారికి బ్యాంకు ద్వారా పశు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇప్పిస్తున్నామని దాని వలన పశు పోషణకయ్యే ఖర్చులు కేసీసీ కార్డుల ద్వారా రైతులు ఉపయోగించుకోవటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పశువైద్యులు ప్రవీణ్‌కుమార్, మీనాక్షి దేవి, బి.జగదీష్ కుమార్, కరీముల్లా, వాసులు పాల్గొని 95 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మీ పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన సదస్సు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగ అనుదీప్, డాక్టర్ ఉషారాణి

నిజాంపట్నం: టీబీ వ్యాధి సోకకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్ నాగ అనుదీప్ తెలిపారు.మండలంలోని గరువుపాలెం గ్రామంలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ (వైయస్సార్ విలేజ్ క్లీనిక్)హెల్త్‌మేళాలో టీబీ ముక్తభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగఅనుదీప్ మాట్లాడుతూ మైకోబ్యాక్టీరియా ట్యూబర్కులైన్ అను సూక్ష్మక్రిని టీబీ వ్యాధి కలిగిన రోగి దగ్గినప్పుడు, ఉమ్మినప్పుడు, చీదినప్పుడు తుప్పర్లద్వారా మరొకరికి సోకుతుందని తెలిపారు. రెండు వారాలకు మించి కళంకల్లో రక్తం పడటం, ఊపిరితీసుకోవడం ఇబ్బంది, అలసట, బరువు తగ్గడం, రాత్రి సమయాల్లో జ్వరం చెమటలు పట్టడం, ఆకలి లేకపోవడం వంటి టీబీ (క్షయ) వ్యాధి ముఖ్య లక్షణాలని తెలిపారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి కళ్లె పరీక్షద్వారా వ్యాధి నిర్ధారించి హెల్త్ సెంటర్ నందే ఆరు నెలలపాటు ఉచిత మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. చంటి పిల్లలకు బీసీజీ వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మకూడదని, మాస్కులు ధరించడం వంటి జాగ్రత్తలు పాటిస్తే టీబీ వ్యాధిని దూరం పెట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి సిహెచ్‌వో సత్తికొండ, ఎంపీహెచ్‌ఈవో రామయ్య, పూర్ణచంద్రరావు, పిహెచ్ఎస్ సుశీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.